క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


మళ్ల విజయప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న పారిశ్రామిక ప్రాంత కార్పొరేటర్లు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌ను ఆయన నివాసంలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు కార్పొరేటర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందించి అభినందనలు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న వార్డు స్థాయి సమావేశాలు, కూటమి పాలనలో ప్రజల ఇబ్బందులపై మాట్లాడారు. అనంతరం వారితో మళ్ల మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో త్వర లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వారంలో ఓ రోజు వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మళ్లను కలిసిన వారిలో 40, 60, 62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పీవీ సురేష్, బల్లా లక్ష్మణరావులతో పాటు పార్టీ నగర కార్యదర్శి పీలా అనంత్‌కుమార్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్, రవి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింధియాలో బీవోబీ శాఖ ప్రారంభం


బీవోబీ సింధియా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అడ్మిరల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

సింధియా: విశాఖపట్నం రీజియన్ పరిధిలో బ్యాంక్ ఆఫ్ బరోడా 44వ శాఖను సింధియా జంక్షన్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ శాఖను నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ నేవీ ఐఎన్‌సీఎస్ రీజినల్ మేనేజర్ రఘురామన్ చక్రవర్తి, బ్యాంక్ రీజినల్ మేనేజర్ పి.ఎం.ప్రధాన్, డి.ఆర్.ఎం .సతీషా సాలుంకే, బ్రాంచ్ మేనేజర్ సాయిబాబా, విశాఖ నగరంలోని ఇతర బ్రాంచ్ ల మేనేజర్లు, రీజినల్ ఆఫీస్ సిబ్బంది, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


మాట్లాడుతున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధి వినోద్ నగర్‌లో డ్రైన్, రహదారి ఆధునికీకరణ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకటలక్ష్మి, టీడీపీ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నరవ పైడిరాజు, జీవీఎంసీ సిబ్బంది రామకృష్ణ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో రైలు ప్రమాదాలకు చెక్

సీతమ్మధార : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లాట్, డిజిటల్ సెన్సార్ల వినియోగం ద్వారానే దేశంలో రైలు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జేటీ రామారావు సూచించారు. ఆయన ఆశీలుమెట్ట జీవీఎంసీ గాంధీపార్కులో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. రైళ్లు, ట్రాక్‌లను సురక్షితంగా వుంచేందుకు నిపుణులైన సిబ్బంది తరచూ తనిఖీలు చేయాలన్నారు. రైలు డ్రైవర్లపై పని ఒత్తిడి పూర్తిగా తగ్గించాలన్నారు. రైల్వే యూనియన్ మాజీ నాయకులు కె.రామచంద్రమూర్తి, భక్తుల నీలకంఠం, ఆర్.తాతారావు, వి.శివాజీ, కె.జగదీష్, జి.సుమతి, కె.దానయ్య, కె.రామకృష్ణ, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.


బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ స్కూల్


పరిమితికి మించి తరగతిలో కూర్చున్న విద్యార్థులు

నేలబారు చదువులు

ప్రభుత్వం మారింది. ప్రాధాన్యతలూ మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీట వేశారు. సర్కారీ స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మార్చారు. దాని ఫలితంగా చాలా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. కూటమి ప్రభుత్వం ఆ మేరకు వసతులపై దృష్టిసారించట్లేదు. ప్రచార పటాటోపం తప్ప, కనీస చర్యల్లేవు. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇందుకు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ స్కూల్ పరిస్థితే నిదర్శనం.


నేలపైనే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

- బుచ్చిరాజుపాలెం స్కూల్లో సమస్యల తిష్ట
- సరిపడా గదుల్లేక నేలపైనే తరగతుల నిర్వహణ
- 1 నుంచి 8వ తరగతి వరకు 341 మంది విద్యార్థులు
- స్కూళ్లలో వసతుల కల్పన పట్టని కూటమి ప్రభుత్వం

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ స్కూల్‌లో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవటంతో చదువులు సవ్యంగా సాగటం లేదు. ఎన్‌ఏడీ సెంటర్‌లో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో ఉన్న స్కూల్ ఇదొక్కటే. ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఓ వైపున ఉన్న 52, 57 వార్డులు, మరో వైపునున్న 89, 90వ వార్డుల పరిధిలోని కాలనీలకు చెందిన పేద విద్యార్థులు ఈ స్కూల్‌కే వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల స్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో అధికారులు శ్రద్ధ చూపటం లేదు. బుచ్చిరాజుపాలెం స్కూల్ సమస్యలు గురించి పూర్తిగా తెలిసిన స్థానిక ఎమ్మెల్యే గణబాబు సైతం దృష్టి సారించకపోవటంపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పట్టించుకునేవారేరీ?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల రూపు రేఖలు మార్చేలా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా బుచ్చిరాజుపాలెం యూపీఎస్‌ను తొలివిడతలోనే ఎంపిక చేసి, రూ.19 లక్షలతో ఆధునికీకరించారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు నిర్మించాల్సి ఉన్నప్పటికీ, స్థలం అందుబాటులో లేకపోవటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసమని అప్పట్లో ప్రయత్నాలు చేశారు. ఈలోగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో, ఈ ప్రయత్నాలు మరుగున పడ్డాయి. ఇరుకైన ప్రదేశంలో ఉన్న స్కూల్లో కనీసం ఆడుకునేందుకు స్థలం కూడా లేదు. పేద, మధ్య తరగతి పిల్లల చదువులకు అందుబాటులో ఉన్న విద్యాలయం కావడంతో దీనికి అనువైన స్థలం కేటాయించి, మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేలపైనే విద్యార్థులు

1 నుంచి 8వ తరగతి వరకు నిర్వహించే బుచ్చిరాజుపాలెం అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ప్రస్తుతం 341 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 8 గదులు అందుబాటులో ఉండగా, ఒక గదిని హెచ్‌ఎం, కార్యాలయ నిర్వహణకు కేటాయించగా, మిగిలిన ఏడు గదుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. వాస్తవంగా ఒక్కో తరగతి గదిలో 40 మంది విద్యార్థులనే కూర్చొబెట్టాలి. కానీ ఇక్కడ అంతకు మించి విద్యార్థులు క్లాసుల్లో ఉన్నారు. గదులు సరిపడా లేకపోవటంతో 3వ తరగతి విద్యార్థులను వరండాలో నేలపై కూర్చొబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. స్కూల్‌కు వెళ్లే తల్లిదండ్రులు నేలపై కూర్చొని చదువుకుంటున్న తమ పిల్లలను చూసి, కూటమి ప్రభుత్వంలో పిల్లలకు నేలబారు చదువులు తప్పవా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయులు కొరత

బుచ్చిరాజుపాలెం స్కూల్లో హెచ్‌ఎంతో పాటు మరో 7గురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల్లేకపోవడంతో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన సవ్యంగా సాగటం లేదు. హిందీ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడు లేరు. గోపాలపట్నం మండలంలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కానీ బుచ్చిరాజుపాలెం స్కూల్లో ఉపాధ్యాయ కొరతను తీర్చేందుకు ప్రయత్నించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్దుబాటు చేస్తాం

బుచ్చిరాజుపాలెం లాంటి స్కూల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుతం సర్‌ప్లస్ టీచర్లు అంతా డివిజన్ లెవెల్లో ఉన్నారు. వారు వెనక్కి వచ్చినట్లైతే, అవసరం ఉన్న చోట్ల వినియోగించుకుంటాం. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో మౌలిక సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– అంబటి సోమేశ్వరరావు, ఎంఈవో, గోపాలపట్నం

భారీ వర్షం.. చిత్తడిగా రోడ్లు

- గుంతలలో నిలిచిన బురద నీరు
- ఇబ్బంది పడ్డ వాహనదారులు


ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన బురద నీరు


భారీ వర్షానికి శ్రీహరిపురం సర్వీస్ రోడ్డు పరిస్థితి


మల్కాపురం సర్వీస్ రోడ్డులో నిలిచిన వ్యర్థాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం ఉదయం అరగంటకుపైగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో సర్వీస్ రోడ్లతోపాటు, పలు చోట్ల నీరు భారీగా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కాల్వల్లోని వ్యర్థాలు బయటకు వచ్చి, రోడ్లు చిత్తడిగా మారాయి. 58వ వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో బురద నీరు నిలిచింది. అసలే ఈ మార్గం భారీ వాహనాల రాకపోకలతో భారీ గుంతలతో ఉంది. దీనికి తోడు భారీ వర్షం రావటంతో ఆ గుంతల్లో నీరు చేరి, చిన్నపాటి చెరువులను తలపించేలా మారింది. ఈ మార్గాల్లో వచ్చే పలువురు వాహనదారులు ఇక్కడి గుంతలతో ఇబ్బందులు పడ్డారు. వర్షానికి శ్రీహరిపురం, మల్కాపురం, కోరమాండల్, జింక్ ఏరియా తదితర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. మల్కాపురం సర్వీస్ రోడ్డులో కాలువల్లోని వ్యర్థాలు బయటకు వచ్చి, రోడ్డుపైనే నిలిచి, అధ్వానంగా మారింది.

పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్


పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్‌ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. కార్మికుల కష్టాలతోనే వేల కోట్లు సంపాదించి ప్రస్తుతం వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేయాలనుకోవడం సరికాదన్నారు. మరో వందేళ్లకు సరిపోయే రిజర్వు ఫండ్స్ పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు. రామలింగేశ్వరావు, శంకర్రావు, నాయుడు, రాఘవులు, రమణ, పోతన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాకానినగర్‌లో యువకుడి వీరంగం

పోలీసులను ఆశ్రయించిన కాలనీ వాసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధి కాకానినగర్‌లో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. గత కొంత కాలంగా కాలనీలోని పలువురిని వేధింపులకు గురిచేస్తున్న సదరు యువకుడు ఆదివారం దుర్గమ్మ వారి ఊరేగింపు సమయంలో ఓ ఇంట్లోకి చొరబొడ్డాడు. ఆ ఇంట్లో ఉన్న వ్యక్తిని తీవ్రంగా గాయపరచగా, అడ్డు వచ్చిన వృద్ధురాలిని కిందికి తోసేశాడు. దీంతో గాయాలపాలైన ఆ వృద్ధురాలిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సైకో మాదిరి వ్యవహరిస్తూ, కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, కొట్లాటకు దిగుతుండటంతో భరించలేని కాలనీ వాసులంతా సోమవారం పోలీసులను ఆశ్రయించారు. సుమారు వంద మందికి పైగా మహిళలతో పాటు, స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు దీనిపై విచారణ చేపట్టారు.

అందరికీ కందిపప్పు అందిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: కార్డుదారులందరికీ కందిపప్పు అందించేలా తగిన ఏర్పాట్లు చేశామని జిల్లా సివిల్ సప్లై అధికారులు వెల్లడించారు. 'పండగ రోజూ తప్ప ని పాట్లు' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలోని 5,24,298 మంది కార్డుదారులకు 8,227.975 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నెలవారీ వినియోగంలో భాగంగా జిల్లాకు సుమారు 225 టన్నుల కందిపప్పు కేటాయించగా.. నేటి వరకు 179 టన్నులు ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద నుంచి పీడీ షాప్‌లకు, అక్కడి ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ 0891–2590100, 0891–2590102కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పబ్లిక్ రోడ్లపై ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్లు

రాకపోకలకు ఇబ్బందులు..
భయాందోళనలో స్థానికులు


మళ్ల సూరివీధిలో రోడ్డుపైనే ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్లు

కంచరపాలెం: బహుళ అంతస్తుల నిర్మాణదారులు తమ భవనం లోపల ఏర్పాటు చేసుకోవాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డెక్కేస్తున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి మళ్ల సూరివీధి సచివాలయానికి కూతవేటు దూరంలో భారీ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. కంచరపాలెం జోన్–2 ఈపీడీసీఎల్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణాలకు ప్రభుత్వ నిబంధనలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలి. వీరి పర్యవేక్షణ లోపంతో దిగువ స్థాయి సిబ్బంది బిల్డర్లతో లాలూచీ పడి నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అదే విధంగా చేస్తూ రోడ్లపైకి వచ్చేస్తున్నారు. దీంతో రోడ్ల మీదుగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సమస్యపై స్థానిక ఏఈకి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, కొత్తగా వచ్చిన అధికారులు తమకు సంబంధం లేదనే సమాధానం ఇస్తున్నారని ఆక్షేపిస్తున్నారు. అపార్ట్‌మెంట్ సెల్లార్/ప్రహరీ గోడ లోపల ఏర్పాటు చేసుకోవాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీటి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం మరో కారణంగా స్థానికులు చెప్పున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి వాటిని పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా దుర్గమ్మకు పూజలు


బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శన


గాజువాక ఆర్టీసీ డిపో వద్ద పూజలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బద్రీనాథ్


శ్రీహరిపురం కల్పన ఆటోస్టాండ్ వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా 58వ వార్డు శ్రీహరిపురం కల్పన ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. మండపం వద్ద భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఎమ్మెల్యే పి.గణబాబు, వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, తెలుగు యువత నాయకుడు రామ్మోహన్‌నాయుడు, జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు జరిపి, అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పొత్తబత్తుల శ్రీను, కల్పన ఆటోస్టాండ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

➡ 60వ వార్డు శ్రీహరిపురం, జవహర్‌నగర్ వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో దుర్గాదేవి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 12 ఏళ్లలోపు వయసున్న బాలికలు దుర్గాదేవి వేషధారణలో అమ్మవారి అవతార విశేషాలు, మహిషాసుర మర్దని రూపంలో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సింధూ తదితరులు పాల్గొన్నారు.

➡ గాజువాక ఆర్టీసీ డిపో వద్ద విజయదుర్గా ఆలయంలో దసర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలిదిండి బద్రీనాథ్, చికెన్ రాజు, గాజువాక డిపో ఎస్‌ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్ నగర్ శివాలయం వద్ద శ్రీ దుర్గా యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే గణబాబు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జనసేన పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, ఆది, భూలోక, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రోడ్లపైనే పశువులు.. పట్టించుకోని అధికారులు


మల్కాపురం సర్వీస్ రోడ్డులో వ్యర్థాల వద్ద గుంపుగా చేరిన ఆవులు

మల్కాపురం: 61వ వార్డులో పశువుల పెంపకందారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పెంచుకునే పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. పలుమార్లు వీటి కారణంగా స్థానికులు గాయపడుతుంటే, ఇవి వదిలే వ్యర్థాలను తొలగించలేక మరింతగా ఇబ్బంది పడుతున్నారు. వార్డు పరిధి మల్కాపురం మరడిమాంబ ఆలయం వెనుక చాలా మంది వ్యక్తులు ఇటీవల ఆవుల పెంపకం, వాటి ద్వార వచ్చే పాలను అమ్ముకునే వ్యాపారం చేస్తున్నారు. ఆవులను పెంచటం మంచిదే అయినా, వాటికి ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయకుండా, వీధుల్లో వదిలేస్తున్నారు. పాలను సేకరించే సమయంలో తప్ప, మిగిలిన వేళల్లో ఇవి వీధుల్లోనే సంచిరస్తూ, వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. రోడ్లపై పోగయ్యే చెత్తాచెదారాలను తింటూ, ఆ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా మార్చేస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. చాలాసార్లు వీధుల్లో రాకపోకలు సాగించే చిన్నారులపై కొమ్ములతో దాటి చేస్తున్నాయని చెప్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి, వీధుల్లో ఇష్టారాజ్యంగా పశువులు తిరుగాడకుండా నియంత్రించాలని కోరుతున్నారు.

కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి



ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

సీతంపేట : స్పెన్సర్స్ యాజమాన్యం కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలని ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రేసపువానిపాలెం స్పెన్సర్స్ హైపర్ మాల్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా 22 మంది కలాసీలు ఇక్కడ లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్నారన్నారు. స్పెన్సర్స్ మాల్ మూసివేతతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. రోడ్డున పడ్డ వీరికి సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం కలకత్తాలో ఉంటూ లేబర్ ఆఫీసులో జరిగే జాయింట్ మీటింగ్‌లకు హాజరుకాకుండా, కలాసీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేస్త్రి బి.నూకనాయుడు, బి.ఏసుబాబు, ఎస్.అచ్చంనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జింక్ ఓల్డ్ క్వార్టర్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకున్నట్లు గాజువాక ఎస్‌ఐ టి.రవికుమార్ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. వైట్ అండ్ గ్రే కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ ఆఫ్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక సీఐ 9440796014, ఎస్‌ఐ 7675022534 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆదాయ పన్నుపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇన్‌కమ్‌టాక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయపు పన్ను చెల్లింపుల్లో వచ్చిన మార్పులు, ఇటీవల పరిణామాలను టీడీఎస్ సర్కిల్ జాయింట్ కమిషనర్ కె.ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ ఐ. మధుసూదనరావు వివరించారు. ఆర్థిక సమాచారం, వార్షిక సమాచార వ్యవస్థ ద్వారా డేటా సేకరణ, అప్పీళ్ల గురించి తెలియజేశారు. ఐటీ మినహాయింపులు, నిజమైన క్లెయిమ్‌లు, పన్ను చెల్లింపుదారుల సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.